క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జున స్వామికి విశేష పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో ఉన్న ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో వైశాఖ మాసం సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఫ్యామిలీ హెల్త్ క్లినిక్‌కు స్పందన


బనగానపల్లెలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాహైల్‌బాబు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని గ్రామ సచివాలయం-4లో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాహైల్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ హెల్త్ క్లినిక్‌కు స్పందన లభించింది. వివిధ జబ్బులతో బాధపడుతున్న సుమారు 89 మంది బాధితులకు బీపీ,షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


సచివాలయం-3లో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి లావణ్య

బనగానపల్లె రూరల్ : అనారోగ్యం కారణంగా నడువలేని, వృద్ధులు, దివ్యాంగులు,పక్షవాత బాధితులకు సోమవారం ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మండలంలో వివిధ రకాల పింఛన్లు మొత్తం 12,683 మంది ఉండగా వీరిలో 3,083 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తారు. మిగిలిన వారికి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యాయి. మొత్తం 93 శాతం మందికి పింఛన్ సొమ్ము అందజేశామని ఈ నెల 5వ తేదీలోపు వంద శాతం పూర్తి చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు.

నివాళి


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహమ్మద్ రఫీ(52) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలీ, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, పిట్టల జాకీర్, జశ్వంత్‌రెడ్డి, ఖాజా, సుభాన్ నివాళులర్పించారు.

రాయితీపై కంది విత్తనాలు


ఆర్‌ఎస్ రంగాపురంలో అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

బేతంచెర్ల: రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై కంది విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆశా రకం 20 క్వింటాళ్లు, ఎల్‌ఆర్‌జీ 105 రకం 10 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 30 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు అవసరమైన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

వారాంతపు సంత బంద్

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో మంగళవారం జరిగే వారాంతపు సంతను బంద్ చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉండటంతో రద్దు చేయించామని, చుట్టు పక్కల గ్రామాల నుంచి వినియోగదారులు రావద్దని సూచించారు. నిబంధనల మేరకు రోడ్లపై, వీధుల్లో జనం గుంపులుగా ఉండరాదన్నారు. దుకాణాలు,టీస్టాళ్లు,హోటళ్లు మూసివేయాలని చెప్పారు.


బనగానపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి చేరిన వర్షపు నీరు


చెరువును తలపిస్తున్న పంట పొలాలు


హెచ్.కొట్టాల గ్రామం వద్ద నిలిచిన నీరు

భారీ వర్షం

- బనగానపల్లెలో 178.8 మి.మీ. వర్షపాతం నమోదు
- 28 ఏళ్లల్లో ఇదే అత్యధికం
- కొలిమిగుండ్ల మండలంలో 75.4 మి.మీ.,
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు


వ్యవసాయ పొలాల్లో చెరువులను తలపించేలా వర్షపు నీరు

బనగానపల్లె : బనగానపల్లె ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అధికారుల వివరాల మేరకు 178.8 మీ.మీ వర్షపాతం నమోదైంది. కాగా నంద్యాల జిల్లాలో ఇదే అత్యధిక వర్షపాతం నమోదు. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల ఆదివారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో బనగానపల్లె సమీప ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. స్థానిక విద్యుత్‌సబ్ స్టేషన్‌లో నీరు చేరడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంపు సెట్లు ఏర్పాటు చేసి నీటిని విద్యుత్ అధికారులు బయటికి తరలించారు. బనగానపల్లె నుంచి నంద్యాలకు వెళ్లే రహదారిలో తిమ్మాపురం వద్ద ఉన్న వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఉదయం 10 గంటల వరకు వాహనాల రకాపోకలు నిలిచి పోయాయి. రాయపాడు వద్ద కుందూనదిలో నీటి ప్రవాహం భారీగా ఉండటంతో వాహనాల రకపోకలు నిలిచిపోయాయి. ఇక పొలాలు చెరువులను తలపించాయి. కాగా..గత 28 సంవత్సరాలుగా ఇంతటి వర్షపాతం నమోదు కాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 75.4 మి.మీ, అవుకు మండలంలో 66.2 మి.మీ, దొర్నిపాడు మండలంలో 63.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 57.4 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 27 మి.మీ, సంజామల మండలంలో 20.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో పట్టణంలోని సంతమార్కెట్, అమ్మవారిశాల, ఎస్‌ఎల్‌వీటీ టాకీస్, తదితర ప్రాంతాల్లో ప్రధాన వీధులు జలమయమయ్యాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భారీగా వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు:
సబ్ డివిజన్‌తోపాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. కోవెలకుంట్ల- లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో కైప, కప్పల, నల్ల, ఎర్రవాగులు ఉధృతంగా ప్రవహించాయి. లోతట్టు వంతెనలు కావడంతో వంతెనలపై వరదనీరు భారీగా చేరడంతో ఈ రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షం పడటంతో సీజన్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొలిమిగుండ్ల: నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. సోమవారం తెల్లవారుజామున మండల వ్యాప్తంగా రెండు గంటల పాటు కుండపోత వాన కురిసింది. అధికారుల లెక్కల ప్రకారం 75.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షం కురవడంతో బెలుం గుహల సమీపంలోని కుంటలోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. బెలుం గ్రామంలోని పురాతన సిద్ధ రామేశ్వరస్వామి ఆలయం చెంతలో ఉన్న బావి పొంగి పొర్లింది. ఆయా గ్రామాల్లోని వీధులు జలమయం అయ్యాయి. కొలిమిగుండ్లలో నాయినపల్లె రోడ్డు వైపులో ఉన్న పొలాల నుంచి నీరు పెద్ద ఎత్తున సొసైటీ వెనుక భాగాన ఉన్న కాలనీల్లోకి చేరాయి.

బేతంచెర్లలో 3 సె.మీ వర్షపాతం
బేతంచెర్ల: మండలంలో సోమవారం 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. నైరుతి రుతుపవనాల ఆగమనంతో కురిసిన వర్షానికి ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో నీరు నిలిచింది. ఇప్పటికే ఖరీఫ్ సాగు కోసం రైతన్నలు పొలాలు సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే వర్షం కురవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు
బేతంచెర్ల: పట్టణంలో సోమవారం కురిసిన వర్షానికి కర్నూలు, డోన్ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్లు చిన్నపాటి కుంటలను తలపించాయి. వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరికి అస్వస్థత
కోవెలకుంట్ల: పట్టణ శివారులోని స్కంద కాలనీలో పిడుగుపాటుకు ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. కోవెలకుంట్లలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షం అధికంగా పడుతుండటంతో పట్టణానికి చెందిన సురేష్‌రెడ్డి, వలి కాలనీలో మర్రిచెట్టు కింద ఉండగా చెట్టుపై పిడుగు పడింది. దీంతో పక్కనే ఉన్న ఇద్దరూ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. కాలనీవాసులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


కర్నూలు రహదారిలోని అయ్యల చెర్వులో రహదారిపై నిలిచిన నీరు


చిన్నకొప్పెర్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రవాగు


బెలుం గుహల సమీపంలో వర్షపు నీటితో నిండిన కుంట

హోటళ్లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయాలి


డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా పట్టణంలో హోటళ్లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేయాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డోన్ పట్టణంలో మంగళవారం 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నలుగురికి మించి గుమిగూడితే అరెస్టు చేస్తామన్నారు. ఫలితాల నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లు, ర్యాలీలపై నిషేధం ఉన్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్లు, దుకాణాల వద్ద ప్రజలు గుమిగూడే అవకాశం ఉన్నందున వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసి పోలీసులకు సహకరించాలని కోరారు. మెడికల్ షాపులు, పాల బూత్‌లు తప్ప ఇతరత్రా దుకాణాలు మూసివేయాలన్నారు. ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమతి లేకుండా సంచరిస్తే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు.

డోన్ డిపోకు రెండు కొత్త బస్సులు


బస్సులను ప్రారంభిస్తున్న డీఎం శశిభూషణ్

డోన్ టౌన్: డోన్ ఆర్టీసీ డిపోకు రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. సోమవారం డిపో చేరుకున్న బస్సులకు పూజలు నిర్వహించి పాత బస్టాండ్ వరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బస్సులు ఉదయం 10 గంటలకు డోన్ టూ హైదరాబాద్, రాత్రి 9గంటలకు డోన్ టూ కూకట్‌పల్లి మధ్య నడుపుతామని తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ మోజీద్, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ


ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో కొలువైన శ్రీ ఉమా మహేశ్వరస్వామి వార్లకు అభిషేకం, అర్చన తదితర పూజలు జరిపించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, అందంగా ముస్తాబు చేసిన పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపాడు గ్రామ సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఫలితాలు ఎలా ఉన్నా సంయమనం పాటించాలి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం ప్యాపిలిలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో పోలీసుల నిఘా మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని కోరారు. బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

విజ్ఞానం.. వికాసం

వేసవి సెలవులు వచ్చాయంటే విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలుతుంటారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు పట్టణంలోని గ్రంథాలయానికి వెళ్లి తమకు నచ్చిన పుస్తకాలు, వార్త పత్రికలను చదవడమే కాకుండా కంప్యూటర్‌లో శిక్షణ తీసుకుంటూ మెదడుకు పదును పెడుతున్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. చదువుతో పాటు క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహిస్తున్నారు.

–బేతంచెర్ల


గ్రంథాలయంలో పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు


కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

మంత్రి బుగ్గన మెజారిటీపైనే అందరి దృష్టి

ప్యాపిలి: డోన్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరుపున బరిలో ఉన్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సాధించే మెజారిటీపైనే అందరి దృష్టి నెలకొంది. గత నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. దాదాపు 20 రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. దీంతో మారుమూల గ్రామాలు మొదలు పట్టణం వరకు ఎక్కడ చూసినా ప్రజల్లో ఇదే చర్చ జరుగుతోంది. డోన్ ఎమ్మెల్యేగా ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హ్యాట్రిక్ విజయం దాదాపు ఖాయమైనట్లే అని రాజకీయ పరిశీలకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేనంతగా డోన్ నియోజకవర్గంలో మంత్రి చేపట్టిన అభివృద్ధి గురించే ప్రజలు మాట్లాడుకుంటున్నారు. దీంతో మంత్రి ముచ్చటగా మూడోసారి సాధించే మెజార్టీ గురించి బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే ఈసారి ఎక్కువ మెజారిటీ వస్తుందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అలాగే రాష్ట్రంలో మరోసారి జగనన్న సంక్షేమ పాలన అధికారంలోకి రానుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

సంజామల: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలకు పాల్పడినా, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో ఎస్‌ఐ మాట్లడుతూ.. నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాల దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతలకు ఎలాంటి భగం వాటిల్లకుండి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అభ్యంతకరమైన పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువల్ల 144 సెక్షన్, 30 పోలిస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా ఉండరాదని సూచించారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

బనగానపల్లె : నేడు నంద్యాలలో సార్వత్రిక ఎన్నికల్లో కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు తప్ప ఎవరూ బయటికి రావద్దని నందివర్గం ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మంగళవారం జిల్లా మొత్తం 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అత్యసరమైతే తప్ప ఎవరూ బయటికి రావద్దని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ర్యాలీలు, విజయోత్సవ సంబరాలు టపాసులు పేల్చేడం చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పింఛన్ కష్టాలు


బీసీ పాయింట్ వద్ద పింఛన్ కోసం క్యూ కట్టిన లబ్ధిదారులు

డోన్ టౌన్: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మూడు నెలలుగా పింఛన్ కష్టాలు వెంటాడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఠంచనుగా అందుకునే లబ్ధిదారులు మూడు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కిక్కిరిసిన బ్యాంక్‌లు : లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేస్తుండడంతో విత్‌డ్రా చేసుకోవడానికి మండల కేంద్రంలోని బ్యాంక్‌లకు తరలిరావడంతో బ్యాంక్‌లు కిక్కిరిసిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ శనివారం, 2వ తేదీ ఆదివారం రావడంతో సోమవారం ఒక్కసారిగా బ్యాంక్‌లు కిటకిటలాడాయి. బ్యాంక్‌లలో పింఛన్‌దారుల ఈకేవైసీ, సంతకం స్కానింగ్, ఆధార్‌కార్డు లింక్ తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్నీ సక్రమంగా ఉన్నా నగదు తీసుకోవడానికి గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. మరికొందరు బ్యాంక్ సమీపంలో ఉన్న బిజినెస్ కరెస్పాండెంట్ పాయింట్ల వద్ద బారులు తీరుతున్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా


బనగానపల్లెలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

బనగానపల్లె రూరల్ : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమల్లో ఉందని, రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని ట్రైనీ డీఎస్పీ రఘువీర్ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రోడ్లపై సీఐ గంటా సుబ్బారావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో కావతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ బనగానపల్లె సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నేడు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేల్చడానికి పోలీసుల అనుమతిలేదన్నారు. ఎవరైనా శాంతిభద్రతకుల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ రామిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- గతంలో తాగునీటి అవసరాలు తీర్చిన బావులు
- ప్రస్తుతం చెత్తదిబ్బలుగా మారిన వైనం
- అభివృద్ధి చేయాలని కోరుతున్న గ్రామస్తులు


ముద్దవరం గ్రామంలో నేటికీ చెక్కు చెదరని పూరాతన బావి


బేతంచెర్లలోని బైటిపేటలో నీటితో ఉన్న బావి

బేతంచెర్ల: పూర్వం విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేనప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించే బావులు నీటితోపాటు జనసంద్రంతో కళకళలాడేవి. క్రమంగా బోరుబావులు అందుబాటులోకి వచ్చాయి. వర్షాభావ పరిస్థితుల్లోనూ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చుతున్నాయి. నాటి చరిత్రకు అనవాలుగా ఉన్న బావుల అభివృద్ధిపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నాడు గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించిన బావులు నేడు చెత్త దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి. నాటి చరిత్రకు, కళానైపుణ్యానికి ఆనవాలుగా ఉన్న బావులు దుస్థితికి చేరుకుంటున్నాయి. బేతంచెర్ల పట్టణంలోని బైటిపేట, ముద్దవరం గ్రామం, ఎం.పెండేకల్లు గ్రామాల్లో పురాతణ బావులు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం భూగర్భజలాల పెంపు కోసం పంట పొలాల గట్ల వెంట కుంటలు, చెరువుల్లో పూడికతీత పనులు చేయిస్తోంది. అలాగే పూరాతన బావులను అభివృద్ధి చేస్తే విద్యుత్ సరఫరా నిలిచి పోయినప్పుడు, బోరు బావుల్లో భూగర్భజాలాలు ఇంకిపోయినప్పుడు గ్రామీణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం ఉంది. అలాగే చరిత్ర కలిగిన కట్టడాలను సంరక్షించి భవిష్యత్తు తరాలకు అందించిన వారం అవుతామని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ఎం.పెండేకల్లు గ్రామంలో రాతితో నిర్మించిన బావి